క్లుప్తంగా

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవేందర్

దేవరకొండ : రమాబాయి అంబేడ్కర్ 88వ వర్ధంతి వేడుకలను శనివారం ప్రజా సంఘాల జేఏసీ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ హాజరై మాట్లాడారు. నేటి మహిళలు రమాబాయి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి వెంకటయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, పొట్ట మురళి, ఎర్ర ఆంజనేయులు, బుర్రి వెంకన్న, వెంకటయ్య, నల్ల శేఖర్, బాలయ్య, ముత్యాలు, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పని జరిగే ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని సూచించారు. రోజు పని కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి మురారి పాల్గొన్నారు.

ముమ్మరంగా కంటి పరీక్షలు

మాడుగులపల్లి : కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిరుమర్తి గ్రామంలో వైద్య సిబ్బంది ముమ్మరంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1664 మంది జనాభా ఉండగా రెండు రోజుల్లో 314 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 68 మందికి రీడింగ్ గ్లాసులు, 55 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. దృష్టి సమస్యలు ఉన్నవారు కంటి శిబిరంలో పరీక్ష చేయించుకోవాలని పాములపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్ కుమార్ సూచించారు. జూన్ ఒకటో తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని కంపాసాగార్ గ్రామ పంచాయతీకి చెందిన అవిరెండ్ల శ్రీను కిడ్నీ సమస్య వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. దీంతో శనివారం సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి మృతుడు శ్రీను ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, వైస్ ఎంపీపీ మట్టయ్య, వేణు, భాస్కర్, రంగారెడ్డి, శ్రీను, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

క్రికెట్‌లో మాటూర్‌కు మొదటి బహుమతి



నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీటీసీ రవి నాయక్

త్రిపురారం : మండలంలోని మాటూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో మాటూర్ గ్రామానికి చెందిన సోనా ఫౌండేషన్ మాటూర్ యూత్ అసోసియేషన్ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో శనివారం మాటూర్ ఎంపీటీసీ ధనావత్ రవి నాయక్ మొదటి బహుమతి కింద రూ. 15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రవి నాయక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడా పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలు నాయక్, పోలగాని నర్సింహ గౌడ్, మడుపు వెంకటేశ్వర్లు, బిచ్చు నాయక్, చంద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి భవనం పూర్తయ్యేదెప్పుడో?

- 2021లో ప్రారంభమైన పనులు
- స్లాబ్ దశలోనే నిలిచిపోయిన భవనం
- అద్దె భవనంలో సిబ్బందికి తప్పని ఇబ్బందులు



స్లాబ్ దశలోనే నిలిచిపోయిన భవనం

కొండమల్లేపల్లి: రెండేళ్ల క్రితం ప్రారంభమైన స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో అద్దె భవనంలో అసౌకర్యాల నడుమ ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నామని సెర్ప్ ఉద్యోగులు వాపోతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు, సంఘ బంధం సభ్యులు స్త్రీ శక్తి భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రూ.37లక్షల రూర్బన్ నిధులతో 2021–22 సంవత్సరంలో మండల మహిళా సమాఖ్య భవన (స్త్రీ శక్తి భవనం) నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు స్లాబ్ వరకు మాత్రమే పనులు జరిగాయి. ఈపాటికే పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందని సెర్ప్ ఉద్యోగులు పేర్కొంటున్నారు. కానీ నిర్మాణ పనుల్లో జాప్యంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటి వరకు 60శాతం పనులు మాత్రమే జరిగాయని, మిగతా 40 శాతం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

అద్దె భవనంలోనే కార్యకలాపాలు

సొంత భవనం లేకపోవడంతో మండల కేంద్రంలో అద్దె భవనంలో స్త్రీ శక్తి కార్యాలయం నిర్వహిస్తున్నారు. నెలకు రూ.4వేల చొప్పున అద్దె చెల్లిస్తూ నిర్వహిస్తున్న స్త్రీ శక్తి కార్యాలయం అసౌకర్యాల నడుమ సాగుతుంది. అద్దె భవనానికి గాను ఏడాదికి రూ.50వేల వరకు భారం పడుతుందని, సకాలంలో స్త్రీ శక్తి భవనం పూర్తిచేస్తే ఇబ్బందులు తీరుతాయని సెర్ప్ ఉద్యోగులు పేర్కొంటున్నారు. సంఘ బంధం సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి అద్దె భవనంలో స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

2021 సంవత్సరంలో రూర్బన్ నిధుల కింద కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణాన్ని ప్రారంభించాం. దీనికి సంబంధించి రూ.20 లక్షల వరకు నిధులు విడుదలయ్యాయి. అంతవరకు 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తిచేయడానికి కావాల్సిన నిధులను త్వరలోనే విడుదల చేయించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– కాళిందిని, డీఆర్‌డీఓ

నక్కలగండి ప్రాజెక్టుపై చర్చకు సిద్ధం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



నక్కలగండి ప్రాజెక్టును సందర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

చందంపేట : వెనుకబడిన ప్రాంతమైన చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో సాగునీటి అవసరాలు తీర్చే నక్కలగండి ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు సిద్ధమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 21న నక్కలగండి ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేపై దేవరకొండ ఎమ్మెల్యే విమర్శలు చేయడాన్ని ఖండిస్తూ శనివారం ప్రాజెక్టును బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటి పూటనే ప్రాజెక్టును సందర్శించామని, ఇక్కడ కనీసం ఒక తట్ట మట్టి ఎత్తే మనిషి కాని, పని చేసే యంత్రాలు కాని లేవన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కుర్చీ వేసుకొని మరీ నక్కలగండి ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పనులు నిలిచిపోయి రెండేళ్లు కావస్తున్నా పనులను ప్రారంభించి కట్టను పూర్తి చేయలేని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కేంద్ర మంత్రిపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేవరకొండ ఎమ్మెల్యే సీఎం కేసీఆర్‌ను కలిసి నక్కలగండి ప్రాజెక్టును పూర్తి చేయించిన తర్వాతనే రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలని, లేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, నాయకులు అంకూరి నర్సింహ, రాములు, ఏటి.కృష్ణ, లాలునాయక్, కల్యాణ్‌నాయక్, పాత్లావత్ ఆంజనేయులు, అంజయ్య, సైదులు, సాంబశివుడు, బహదూర్‌సింగ్, వెంకటయ్య, సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఎమ్మెల్యేవి బూటకపు మాటలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : బూటకపు మోసపూరిత మాటలతో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడ ప్రజలను మోసం చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్‌లు ఆరోపించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు మిర్యాలగూడను అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పడం అవాస్తవమన్నారు. కనీస అవసరాలను గుర్తించలేని నాయకులు ప్రజాప్రతినిధులుగా ఉండడం దురదృష్టకరమన్నారు. రైల్వేస్టేషన్‌లో నుంచి ఈదులగూడెం వరకు రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు దానికి నిధులు తానే మంజూరు చేయించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నేషనల్ హైవే ప్రాజెక్టు కింద రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారని, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకోని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించారన్నారు. పట్టణాభివృద్ధి కోసం కేటాయించిన రూ.200కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలన్నారు. అభివృద్ధి పనులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని దోచుకు తింటున్నారని ఆరోపించారు. సమస్యలపై నిలదీసేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమైతే అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారన్నారు. కమీషన్ల కోసం పార్టీలు మారిన విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవిడి శేకర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, సిద్ధునాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవులు విగ్రహంపై నిర్లక్ష్యం



పోలీసు అమరుడు చెన్నకేశవులు విగ్రహం

నిడమనూరు : మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న పోలీసు అమరుడు ఉన్నం చెన్నకేశవులు విగ్రహాన్ని నిర్లక్ష్యంగా వదిలి వేశారు. పోలీసు అమరుడు ఆ విగ్రహాన్ని 2004లో మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేశారు. కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిగా విస్తరణ చేసిన సమయంలో విగ్రహాన్ని తీసి పక్కనే ఉన్న గ్రంథాలయం వద్ద ఉంచారు. రోడ్డు పనులు పూర్తికాగానే తిరిగి విగ్రహాన్ని అక్కడే ఏర్పాటు చేస్తామని చెప్పిన సదరు కాంట్రాక్టర్ అలాగే వదిలి వేశాడు. ఉన్నం చెన్న కేశవులు 2003లో నెమలిపురి వద్ద నక్సల్స్ పేల్చిన మందుపాతరకు బలైనాడు. తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జూన్ 12లోపు పుస్తకాలు, యూనిఫాం అందజేయాలి



ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

మిర్యాలగూడ : జూన్ 12లోపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం అందజేయనున్నట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని ఎమ్మార్సీ భవనంలో పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు ప్రతి విద్యార్థికి ఉచిత నోట్‌బుక్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం టైలర్ వద్ద సిద్ధం అవుతున్నాయని, జూన్ మొదటి వారంలో విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శిరీష, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది నిరంజన్, నాగేందర్, గోవర్ధనచారి, నర్సయ్య పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న కుర్ర చైతన్య

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీ ఇవ్వడంపై 30వ వార్డు కౌన్సిలర్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డెవలప్‌మెంట్ సభ్యురాలు కుర్ర చైతన్య విష్ణు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం స్థానిక బంగారుగడ్డలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావును కోరడంతో ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంపై రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు కృషితోనే రెండు వందల పడకల ఆస్పత్రి మంజూరైందన్నారు. అదే విధంగా బ్లడ్ బ్యాంక్‌కు రక్తం ఇవ్వడంతో పాటు దాతలను సంప్రదించేందుకు కృషి చేస్తున్న అమ్మ, నాన్న ట్రస్ట్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమె వెంట ట్రస్ట్ కన్వీనర్ పోగుల నవీన్, సభ్యులు రమేష్, షారోజ్‌బాబా, సందీప్, కె. లింగరాజు, కె. సైదులు, వీ. రాజేశ్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళాలు



చింతపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి



గుర్రంపోడు : తానేదార్‌పల్లిలో విరాళం అందజేస్తున్న కరుణాకర్‌రావు

పెద్దవూర: బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మండలంలోని చింతపల్లి గ్రామంలో నూతనంగా చేపడుతున్న కనకదుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.50వేలు, బాసోనిబావి తండాలో చేపడుతున్న సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50వేలు, నాయినివానికుంట గ్రామంలో ఈ నెల 29వ తేదీన జరుగనున్న గంగమ్మ తల్లి పండుగకు రూ.30వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆయా ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భగవాన్‌నాయక్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ ప్రభావతి, పులిమాల కృష్ణారావు, వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచులు లింగయ్య, శంకర్‌నాయక్, నరేష్‌నాయక్, రామకృష్ణనాయక్, పదీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, సత్యం, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

రూ.51 వేల విరాళం

గుర్రంపోడు : మండలంలోని తానేదార్‌పల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెల్గపూరి కరుణాకర్‌రావు శనివారం రూ.51 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గాలి సరితా రవికుమార్, సర్పంచ్ బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు షేక్ సయ్యద్‌మియా, పోనుగోటి నర్సింహారావు, వెల్గపూరి రాంబాబు, శ్రీనివాసరావు, బైరు శంకర్, ఎండీ సర్వర్, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నారి ఐలయ్య

వేములపల్లి: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లుల సాధన, చట్ట రక్షణకై జూన్ 5న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సల్కునూరు, రావులపెంట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. పని దినాలను తగ్గిస్తుందని, ఆరు నెలలైనా ఉపాధి కూలీలకు భత్యం చెల్లించకుండా శ్రమ దోపిడి చేస్తుందన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి పని కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2.64లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాది కూలీలు పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దండంపల్లి సరోజ, అంకెపాక సైదులు, మారయ్య, జనార్దన్, సతీష్, శీలం లింగయ్య, పెదవెంకటయ్య, పద్మ, మంగమ్మ, పుష్ప, పాపమ్మ, రాజు, సరిత, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు వెళ్లేదెలా?



రోడ్డు మధ్యలో నిలిపిన బైక్‌లు

మాడుగులపల్లి : మండల కేంద్రం నుంచి ఇందుగుల వెళ్లే రహదారిపై వాహనదారులు బైక్‌లను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతుండడంతో దుకాణాల ఎదుట మట్టి దిబ్బలు ఉండడంతో గత్యంతర లేక రోడ్డుపైనే బైక్‌లను నిలుపుతున్నారు. దీంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రమాదాలు జరుగకముందే పోలీసులు స్పందించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగిస్తాం

హాలియా : పురపాలిక సంఘం అనుమతి లేకుండా వ్యాపార, వాణిజ్య సంస్థలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఎవరైనా పట్టణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే వెంటనే వాటిని తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాలియా పురపాలిక సంఘం అనుమతి లేకుండా ఇతరులు ఎవరైనా వివిధ ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలను మున్సిపాలిటీ పట్టణంలో ఏర్పాటు చేయరాదన్నారు. 2019 పురపాలిక సంఘం చట్టం ప్రకారం అపరాద రుసుము చెల్లించి మున్సిపాలిటీ అనుమతి పొందాలన్నారు. అనుమతి పొందిన ఫ్లెక్సీలకు పట్టణంలో ఏర్పాటు చేసుకునేందుకుగాను మూడు నుంచి ఏడు రోజులు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా పట్టణంలో ఎవరైనా ఫ్లెక్సీల ఏర్పాటు చేస్తే వెంటనే వాటిని తొలగించనున్నట్లు కమిషనర్ వీరారెడ్డి పేర్కొన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు



కవర్లలో వాడుబట్టి ఎండిపోయిన మొక్కలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జానుగానితండాలో వన నర్సరీ కేంద్రంలోని మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. అంతేగాక నల్లటి కవర్లలో మట్టిని నింపి వదిలేశారు. అలాగే కొన్ని కవర్లలో గింజలు పెట్టినప్పటికీ మొలకెత్తని పరిస్థితి. మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్లు పెట్టాలి కాని ఇక్కడ మూడు నాలుగు రోజుల నుంచి అటువంటి పరిస్థితి లేదు. దీని వల్ల ఉన్న మొక్కలు కూడా వేసవి కాలం కావడంతో వాడు బట్టి ఎండిపోతున్నాయి. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం ఈ విధంగా నీరుగారుతోంది. జూన్ మాసంలో ప్రతి సంవత్సరం కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. కాని అప్పటి వరకు ఈ వన నర్సరీ కేంద్రం నుండి మొక్కలు అందే పరిస్థితి లేదు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా నర్సరీ మొక్కల నిర్వాహణ సక్రమంగా చూస్తున్నామని, వేసవి కాలం కావడంతో మొక్కలు వాడు బట్టి ఎండిపోతున్నాయని సమాధానం ఇచ్చారు. ఇక్కడ మొక్కలకు నీరు పెట్టే కూలీని వివరణ అడగగా మూడు రోజుల నుండి విద్యుత్ సమస్య వల్ల మొక్కలకు నీళ్లు పెట్టలేదని ఆమె బదులిచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ యంత్రాంగం వన నర్సరీ కేంద్రాలపై నిఘా ఉంచాలని, ప్రభుత్వ ధనాన్ని వృథా చేయకుండా కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ టౌన్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పీఆర్‌సీ సిఫారసుల ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని దొడ్డికొమరయ్య భవన్‌లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులను తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టి చేయించడం అన్యాయమన్నారు. వెంటనే కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, అంజయ్య, సైదులు, పరమేష్, సర్వయ్య, యాదగిరి, ఎల్లేష్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని కేశరాజుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంతో పాటు తిప్పర్తి మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీఓ జయచంద్రారెడ్డి తనిఖీ చేశారు. హమాలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనంగా 45 మంది హమాలీలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బి. శ్రీకాంత్ ఆర్డీఓకు తెలియజేశారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అదనపు డీఆర్‌డీఓ శైలజ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2019 నుండి మార్చి 2023 వరకు రూ.30 కోట్లతో చేపట్టిన వివిధ రకాల పనులకు సంబంధించిన నివేదికలను గ్రామపంచాయతీల వారిగా డీఆర్పీలు చదివి వినిపించారు. మండలంలో జరిగిన 30 కోట్ల పనుల్లో సుమారు రూ.8 లక్షలు కొలతల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. ఈసీ నుండి రూ.17 వేలు, సీఓ నుండి రూ.2 వేలు, ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి నుండి రూ.వెయ్యి చొప్పున రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబుర్స్ మెన్ గౌరి, దేవరకొండ క్లస్టర్ ఏపీఓ రవిందర్, సోషల్ ఆడిట్ ఎస్‌టీఎం అజయ్‌కుమార్, ఎస్ఆర్‌పీ బద్రూ, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువుపల్లిలో బైక్ అపహరణ

- వరుస చోరీలు జరుగుతున్నా స్పందించని పోలీసులు

మాడుగులపల్లి : దుకాణం ఎదుట పార్క్ చేసిన బైక్‌ను అర్ధరాత్రి దుండగులు అపహరించారు. మండలంలోని చెరువుపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రె లింగారెడ్డి ఇంటి పక్కనే ఉన్న షెటర్‌లో సిమెంట్ దుకాణం పెట్టాడు. ఈ నెల 25న దుకాణం వద్ద బైక్ పెట్టి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మండలంలో వరుస బైక్ చోరీలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం మండల కేంద్రంలో కొందరి బైకులు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లోనూ జరుగుతుండడంతో జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లాలో ఇదే తరహా చోరీలకు పాల్పడిన ఓ పాత నేరస్తుడు ప్రస్తుతం మండలంలో సంచరిస్తూ చోరీలకు తెరలేపినట్లు సమాచారం. వరుస చోరీలు జరుతున్నా పోలీసుశాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నల్లగొండ క్రైం: బైక్‌పై అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డు శ్రీనగర్ కాలనీకి చెందిన గాదె పాక అరవింద్ స్వామి(23), అదే కాలనీకి చెందిన గురురాజు బైక్‌పై హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తుండగా చర్లపల్లి వద్ద రోడ్డు డివైడర్‌ను అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అరవింద్‌స్వామి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందగా గురురాజుకు కాలు విరిగింది. మృతుడు ప్రైవేటు ఉద్యోగి. మృతుడి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నేడు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

నాగార్జునసాగర్ : 60 ఏళ్లుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు (నందికొండ)కాలనీల్లో నివాసముంటున్న వారికి నేడు(ఆదివారం) స్థానిక ఎమ్మెల్యే భగత్ వార్డుల వారిగా తిరిగి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేయనున్నారు. గతేడాది జూన్2014కన్నా ముందుగా ఇళ్లలో నివాసమున్నట్లు ధ్రువీకరించుకుని 58, 59జీఓల ప్రకారం దరఖాస్తు చేసుకున్న నివాసితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఉచితంగానే రిజిస్ట్రేష్ చేసింది. 58 జీఓ ప్రకారమైతే ఇంటి స్థలం 125గజాల లోపు ఉన్నవారికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. అంతకు మించి ఉన్నవారికి 59జీవో ప్రకారం 250 గజాలవరకు గజం రూ.500లు,ఆ పైన 500 గజాలవరకు ఉన్నవారికి గజం రూ.750లు అంతకు మించి వెయ్యి గజాల లోపు ఉన్నవారికి గజం రూ.1,000లు మేర ఖరీదు వేసి చాలానా చెల్లించిన ఇంటి యజమానులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసింది. ఆ పత్రాలను స్థానిక ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ఆ ఇంటి యజమానులకే పంచాలనే నేపథ్యంలో ఆదివారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి

నల్లగొండ టౌన్: వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు దేశానికే ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ శనివారం నల్లగొండ పట్టణంలోని జెడ్పీ కార్యాలయం ఆవరణలో మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగుల పట్ల తన నిబద్ధతను చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు మత్స్యగిరి, శుభకరణ్‌సింగ్, శ్రీకాంత్, ఖలీమొద్దీన్, భిక్షం, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.